## క్లుప్తంగా

### సమష్టి కృషితో విజయం



సక్సెస్ మీట్‌లో మాట్లాడుతున్న వీసీ ప్రసాదరాజు

బాలాజీచెరువు: ఏదైనా వ్యవస్థలోనైనా సమష్టి కృషి చేస్తేనే విజయం సాధ్యమని జేఎన్‌టీయూకే వీసీ డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు పేర్కొన్నారు. వర్సిటీ తొమ్మిదో స్నాతకోత్సవం విజయవంతంగా నిర్వహించడంపై బోధన, బోధనేతర సిబ్బందికి గురువారం సక్సెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ వర్సిటీకి గవర్నర్ రావడం, కార్యక్రమం విజయవంతం కావడం సంతోషంగా ఉందని, అన్ని స్థాయిల సిబ్బంది సమష్టి సహకారంతోనే ఇది సాధ్యమైందన్నారు. కార్యక్రమమంలో రెక్టార్ కేవీ రమణ, రిజిస్ట్రార్ సుమలత, డైరెక్టర్లు పాల్గొన్నారు.

### ఉపాధి పనులపై సమీక్ష



సిబ్బందితో సమీక్షిస్తున్న ఎంపీడీఓ స్వప్న

కరప: మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో ఉపాధి పనులు చేపట్టి, నిర్దేశించిన లక్ష్యాలు అధిగమించేలా కృషిచేయాలని ఎంపీడీఓ కర్రె స్వప్న అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఉపాధి పథకం ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లు, సిబ్బందిదో ఆమె సమావేశమై ఉపాధిపనులు నిర్వహణ, లక్ష్యసాధనపై సమీక్షించి, పలుసూచనలిచ్చారు. ప్రతీరోజు 4,455 మందికి పని కల్పించాల్సి ఉండగా 4,492 (99 శాతం) పనికల్పిస్తున్నారని, నూరుశాతం చేయాలన్నారు. ఏపీఓ జి.వెంకటరమణ, జేఈ వై.నాగలోవ, టెక్నికల్ అసిస్టెంట్లు టి.రాజేంద్ర, కె.ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

### ధనమ్మ జాతర ప్రారంభం



నవదుర్గలకు జ్ఞాపికలు అందజేసిన గోవిందరావు

బోట్‌క్లబ్: స్థానిక జగన్నాథపురం కోటి స్తంభాలపేటలోని ధనమ్మతల్లి జాతర మహోత్సవాలు గురువారం ప్రారంభమైంది. ఐదో తేదీ వరకూ అమ్మవారి ఆరాధన కార్యక్రమాలు, సాంస్కృతిక కార్యక్రమాలు వైభవంగా నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ ప్రతినిధి బడే గోవిందరావు తెలిపారు. ఆచంట వెంకట లక్ష్మీ బృందం కోలాటం, నవదుర్గ నృత్యోత్సవం భక్తులను ఆకట్టుకున్నాయి. అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు సీహెచ్ శ్రీనివాసరావు, తాతాజీ, జి.సంపత్, నాగేశ్వరరావు, బడే కృష్ణ, పి.లక్ష్మణరావు పాల్గొన్నారు.

### మానవజాతికి బాలలే ఆస్తి

కాకినాడ రూరల్: మానవ జాతికి బాలలే ఆస్తి అని, పిల్లల ప్రాముఖ్యాన్ని గుర్తించి వారి శ్రేయస్సును ప్రోత్సహించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని జిల్లా బాలల సంక్షేమాధికారి సీహెచ్ వెంకట్రావు పేర్కొన్నారు. అంతర్జాతీయ బాలల సంరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాయుడుపాలెం అంగన్‌వాడీ సెంటర్‌లో గురువారం వాకర్స్ క్లబ్ సంఘం ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, శ్రీనగేష్, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

**ప్రపంచ తల్లిదండ్రుల దినోత్సవం**

అలాగే రాయుడుపాలెం అంగన్‌వాడీ సెంటరులో ప్రపంచ తల్లిదండ్రుల దినోత్సవాన్ని గురువారం వాకర్స్ సంఘ అధ్యక్షుడు అడబాల రత్నప్రసాద్ అధ్యక్షతన నిర్వహించారు.

### రోడ్డు ప్రమాదంలో విద్యార్థిని మృతి

కాకినాడ రూరల్: ఏడీబీ రోడ్డులో రమణయ్యపేట గోకుల్ గార్డెన్ వద్ద బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని విద్యార్థిని చుక్కల శిరీష (17)మృతి చెందింది. తిమ్మాపురం పోలీసులు తెలిపిన వివరాలు మేరకు సామర్లకోటలో స్నేహితురాలి వివాహానికి శిరీష పెదనాన్న కొడుకుతో కలసి స్కూటీపై బయలుదేరగా అచ్చంపేట జంక్షన్‌కొద్ది దూరంలో ఉండగా జరిగిన ప్రమాదంలో అక్కడికక్కడే మృతి చెందింది. కోనసీమ జిల్లా చెల్లూరు సూర్యరావుపేటకు చెందిన శిరీష కుటుంబం వాకలపూడి శ్రీనివాసనగర్‌లో ఉంటోంది. తండ్రి రాంబాబు రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో ఒక ఇంజినీరింగ్ కంపెనీలో పనిచేస్తున్నారు. గురువారం కేసు నమోదు చేసి మృతదేహానికి జీజీహెచ్‌లో పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించినట్టు ఎస్సై నాగార్జునరాజు తెలిపారు.

### చికిత్స పొందుతూ యువకుడి మృతి

కరప: ఆత్మహత్యాయత్నానికి పాల్పడి, కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న ఒక యువకుడు మృతిచెందాడు. కరప ఎస్ఐ నౌడు రామకృష్ణ తెలిపిన వివరాల మేరకు మండలం గురజనాపల్లి శివారు అడవిపూడి గ్రామానికి చెందిన కోట నాని (36) కొంతకాలంగా మానసిక వ్యాధితో బాధపడుతున్నాడు. ఈ నేపథ్యంలో గత నెల 30న ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు పసికట్టి, అపస్మారక స్థితిలో ఉన్న అతనిని చికిత్స కోసం కాకినాడ ఆసుపత్రికి తరలించారు. అప్పటి నుంచి చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# ఐసీయూలో అగ్నిప్రమాదం

- జీజీహెచ్‌లో ఏసీ నుంచి మంటలు
- ఊపిరాడక అవస్థలు పడ్డ రోగులు
- ఆగమేఘాలపై సురక్షిత వార్డులకు తరలించిన సెక్యూరిటీ, శానిటేషన్ సిబ్బంది



ఐసీయూ నుంచి రోగిని తరలిస్తున్న ఎంఎన్‌వో

కాకినాడ క్రైం: స్థానిక జీజీహెచ్‌లోని ఎక్యూట్ మల్టీకేర్ యూనిట్ (ఏఎంసీయూ–1)లో గురువారం సాయంత్రం షార్ట్ సర్క్యూట్‌తో ఏసీకి మంటలు వ్యాపించాయి. తక్షణమే స్పందించిన శానిటేషన్ సిబ్బంది విద్యుత్ మెయిన్ లైన్‌ను ఆఫ్ చేయడంతో మంటలు అక్కడికక్కడే నియంత్రణలోకి వచ్చాయి. ఆ మరుక్షణమే దట్టమైన పొగ ఐసీయూను కమ్మేసింది. రోగులకు ఎటువంటి ప్రమాదం వాటిల్లకుండా శానిటేషన్, సెక్యూరిటీ సిబ్బంది, ఎంఎన్‌వోలు స్పందించిన తీరు అబ్బురపరిచింది. అందిన రోగిని అందినట్లు స్ట్రెచర్లు, చక్రాల కుర్చీలతో తరలించడంతో పాటు భుజాలపైకి ఎత్తుకుని సురక్షిత వార్డులకు పరుగులు పెట్టారు. వైద్యుల సూచనల మేరకు పలువురిని అత్యవసర విభాగానికి, కొందర్ని సీఐసీయూకి, మరికొందర్ని వెంటిలేటర్ సౌకర్యమున్న ఇతర ఐసీయూలకు క్షణాల్లో తరలించి ఏ ఒక్కరికీ హాని జరగకుండా కాపాడారు. 12 పడకలున్న ఏఎంసీయూ–1లో గురువారం సాయంత్రం 11 మంది రోగులు చికిత్స పొందుతున్నారు. వారిలో స్పృహలేని స్థితిలో చికిత్స పొందుతున్న వారూ ఉన్నారు. మంటలు, పొగ తీవ్రతకి వీరంతా ఒక్కసారిగా ఉక్కిబిక్కిరయ్యారు. పొగ కమ్మేసిన క్షణాల్లో ఆ చిమ్మ చీకట్లో ఎవరో ఇద్దరు వ్యక్తులు వచ్చి తనను భుజాలపైకి ఎత్తుకొని సీఐసీయూకి తీసుకొచ్చి చేర్చారనీ, మంటంలంటుకున్న ఏసీకి సమీపంలో ఉన్న పడక్పై తాను కదల్లేని స్థితిలో ఉన్నానంటూ ఓ మహిళ భయాందోళన వ్యక్తం చేసింది. తనను తీసుకొచ్చినవారి ముఖాలైనా చూడలేదని సిబ్బంది స్పందించిన తీరును భావోద్వేగంతో వెల్లడించింది. ప్రమాద ఘటనకు కారణం షార్ట్ సర్క్యూటేనని డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.వెంకటరెడ్డి తెలిపారు. ఎవరికీ ఎటువంటి ప్రమాదం వాటిల్లలేదని అన్నారు. మంటలంటుకున్న వార్డులో మరమ్మతులు జరుగుతున్నాయని శుక్రవారం ఉదయానికి వార్డు సేవలు అందుబాటులోకి వస్తాయని ఆయన అన్నారు. ఏసీ వైరింగ్ మాత్రమే కాలిందనీ, ఏసీ సహా వార్డులో ఉన్న వెంటిలేటర్లు, ఇతర పరికరాలేవీ కాలలేదని డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ హరి విజయ కుమార్, ఆర్ఎంవో డాక్టర్ రాహుల్ అన్నారు. వారితో పాటు డాక్టర్ వెంకటరెడ్డి ప్రమాదం వేళ తక్షణమే స్పందించి రోగులను కాపాడిన సెక్యూరిటీ, శానిటేషన్ సిబ్బంది, ఎంఎన్‌ఓలను ప్రత్యేకంగా అభినందించారు.



రోగిని స్ట్రెచర్‌పై తరలిస్తున్న సెక్యూరిటీ బృందం



వీల్ చైర్‌లో మహిళా రోగిని తరలిస్తున్న సెక్యూరిటీ సిబ్బంది



ఏఎంసీయూ-1లో కమ్ముకున్న పొగలు



విద్యుత్ పునరుద్ధరించి వార్డును సిద్ధం చేయిస్తున్న డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ హరి విజయకుమార్

### కరపలో 67.5 శాతం పింఛన్ల పంపిణీ



సత్యనారాయణకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ ముసలయ్య

కరప: మండల పరిధిలోని 23 గ్రామాల్లో 11,297 మందికి వివిధ రకాల పింఛన్లు ఇవ్వాల్సి ఉండగా గురువారం 7,625 మందికి (67.50 శాతం) పంపిణీ చేసినట్టు ఎంపీడీఓ కర్రె స్వప్న తెలిపారు. మొత్తం రూ.3.08 కోట్లు బట్వాడా చేయాల్సి ఉండగా రూ.2,08 కోట్లు పంపిణీ చేశారు. సాంకేతిక లోపాలతో, లబ్ధిదారులు లేక పంపిణీ జాప్యం అయ్యిందని ఎంపీడీఓ తెలిపారు. ఈఓపీఆర్డీ ఎస్వీ శ్రీనివాసరావు, గ్రామ కార్యదర్శులు పింఛన్ల పంపిణీని పర్యవేక్షించారు. నడకుదురు-2 గ్రామ సచివాలయంలో 83.64 శాతం, వేళంగి-1 గ్రామ సచివాలయం 82.34 శాతం, యండమూరు సచివాలయం 79.34 శాతంతో పింఛన్ల పంపిణీలో మొదటి మూడు స్థానాల్లో నిలిచాయి.

### నిందితులను కాపాడుతున్నది మోదీయే

కాకినాడ సిటీ: మహిళా మల్లయోధులపై లైంగిక వేధింపులకు పాల్పడిన బ్రిడ్జి భూషన్ చరణ్‌సింఘ్‌ను తక్షణం అరెస్టు చేయాలని కోరుతూ కలెక్టరేట్ వద్ద అంబేడ్కర్ విగ్రహం వద్ద కార్మిక సంఘాలు ధర్నా చేశాయి. 38 కేసుల్లో హత్య, కిడ్నాప్, అత్యాచారం వంటి తీవ్రమైన ఆరోపణలు ఎదుర్కొంటున్న బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్‌ను ఆర్ఎస్ఎస్, బీజేపీ, మోడీ ప్రభుత్వం కాపాడుతూ దేశానికి ప్రతిష్ఠ తెచ్చిన మహిళా రెజ్లర్లకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని ఆందోళనకారులు విమర్శించారు. కార్మిక సంఘాల నాయకులు జి.బేబీరాణి, దువ్వా శేషబాబ్జీ, తోకల ప్రసాద్, తాళ్లూరి రాజు, రాజారావులు మాట్లాడారు.

# మత్స్యకారులకు అండగా ప్రభుత్వం



సీఎంఆర్ఎఫ్ చెక్కును పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి

- ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి
- సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

కాకినాడ: రెక్కాడితే గానీ డొక్కాడని మత్స్యకార కుటుంబాలకు ఎలాంటి కష్టం వచ్చినా ప్రభుత్వం అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆయన రెండు మత్స్యకార కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన చెక్కులను పంపిణీ చేశారు. ఉప్పుటేరు వద్ద కాటాడి వెంకటేశ్వరరావుకు చెందిన బోటు ప్రమాదంలో దగ్ధం కాగా జీవనాధారం కోల్పోయిన అతని సమస్యలను సీఎం జగన్మోహన్‌రెడ్డికి దృష్టికి తీసుకురాగా రూ.5 లక్షలు మంజూరు చేశారు. అలాగే బార్జి నిర్మాణ సమయంలో జరిగిన ప్రమాదంలో బలసాడి దుర్గాప్రసాద్ మరణించగా అతని కుటుంబానికి రూ.3 లక్షలు విడుదల చేశారు. ఈ చెక్కులను బాధిత కుటుంబాలకు అందజేసిన ద్వారంపూడి మాట్లాడుతూ బోట్లకు బీమా సదుపాయం లేకపోవడంతో ప్రమాదాలు జరిగినప్పుడు మత్స్యకారులు జీవనాధారం కోల్పోయి ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ సమస్యను సానుభూతితో అర్థం చేసుకున్న ముఖ్యమంత్రి వారికి ఆర్థికంగా చేయూతనిచ్చారన్నారు. వృత్తిలో భాగంగా మత్స్యకారులు మరింత జాగ్రత్తతో వ్యవహరించి పనిచేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంఎస్ అధ్యక్షుడు అంకాడి సత్తిబాబు, కార్యదర్శి చింతా శ్రీను, పలువురు బోటు యజమానులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## మలేరియా నివారణ మాసోత్సవం ప్రారంభం



మలేరియా నివారణపై ర్యాలీ ప్రారంభిస్తున్న ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో రమేష్ తదితరులు

కాకినాడ క్రైం: మలేరియా నివారణ మాసోత్సవాన్ని గురువారం ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో రమేష్ జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయ ఆవరణలో ప్రారంభించారు. జిల్లా మలేరియా నివారణ అధికారి (డీఎంవో) భాస్కరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మలేరియా నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా భాస్కరరావు మాట్లాడుతూ మలేరియా నివారణ, ప్రజల్లో విస్తృత అవగాహనే లక్ష్యంగా ఈ నెల 30వ తేదీ వరకు మలేరియా నివారణ మాసోత్సవాలు జరపనున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారుల సమన్వయంతో అవగాహన కార్యక్రమాలు చేపడతామన్నారు. మలేరియా నివారణకు ప్రజలు తమ వంతు బాధ్యతతో వ్యవహరించాలని భాస్కరరావు పిలుపునిచ్చారు. నీటి నిల్వలకు తావివ్వొద్దని, ప్రజారోగ్యానికి దోమలు ప్రధాన శత్రువులని గ్రహించి పారిశుద్ధ్య నిర్వహణకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రై డే నిర్వహించాలని డీఎంవో వైద్యాధికారులకు సూచించారు. డీఐవో ప్రభాకర్, డెమో ప్రసాద్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

## ‘పోష్’ కమిటీ సభ్యురాలిగా కృష్ణప్రియ



ఎంపీ గీతను మర్యాదపూర్వకంగా కలసిన కృష్ణప్రియ

కాకినాడ: మహిళలపై లైంగిక వేధింపుల నియంత్రణ కమిటీ (ప్రివెంటివ్ ఆఫ్ సెక్యువల్ హెరాస్‌మెంట్-పోష్) సభ్యురాలిగా బీర కృష్ణప్రియ నియమితులయ్యారు. దేశంలోనే ప్రతిష్టాత్మకమైన ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫారెన్ ట్రేడ్ (ఐఐఎఫ్‌టీ)కి అనుబంధంగా పనిచేసే ఈ కమిటీకి అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సుజాత చైర్ పర్సన్‌గా, మరో ఆరుగురిని సభ్యులుగా నియమించారు. ప్రభుత్వేతర సంస్థల తరఫున ఎంపీ వంగా గీత, సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి సిఫార్సు మేరకు కల్పకం ఏచూరి మహిళా శక్తి సంఘం ప్రతినిధి కృష్ణప్రియకు అవకాశం కల్పించారు. బీటెక్ పట్టభద్రురాలైన కృష్ణప్రియ సుదీర్ఘకాలంగా మహిళల అభివృద్ధి, సంక్షేమం, సమస్యల పరిష్కారానికి కృషిచేశారు. కృష్ణప్రియ ఎంపీ గీత, ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డిలను కలసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఆమెను కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, మాజీ డిప్యూటీ మేయర్ పసుపులేటి వెంకటలక్ష్మి, ఎమ్మెల్సీ అభ్యర్థి కర్రి పద్మశ్రీ అభినందించారు.

## క్రికెట్ టోర్నీ మొదటిదశ పూర్తి



వేళంగి హైస్కూలులో మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును విజేతకు అందజేస్తున్న చౌదరి

కరప: మండలం వేళంగి మెర్లాస్ జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో వేళంగి గ్రాడ్యుయేట్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మర్ క్రికెట్ టోర్నీ గురువారంతో మొదటి దశ పోటీలు పూర్తయినట్టు నిర్వాహకులు తెలిపారు. అండర్-19 విభాగంలో వేళంగి వారియర్స్ జట్టుపై సిరిపురం జట్టు విజయం సాధించింది. మ్యాన్ ఆఫ్‌దిమ్యాచ్‌గా సాయిగణేష్ (సిరిపురం) నిలిచాడు. నో ఏజ్ లిమిట్ విభాగంలో జరిగిన మొదటి మ్యాచ్‌లో గొల్లపాలెం జట్టుపై పెద్దాపురప్పాడు జట్టు గెలిచింది. మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్‌గా గంగాప్రసాద్(పెద్దాపురప్పాడు) నిలిచాడు. రెండో మ్యాచ్‌లో కరప జట్టుపై గొర్రిపూడి జట్టు విజయం సాధించింది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా వెంకటేష్ (గొర్రిపూడి) నిలిచాడు. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డులను గ్రామస్తులు చుండ్రు వెంకన్నరాయ్‌చౌదరి అందజేశారు.

## చోరీలు, ప్రమాదాలతో జాగ్రత్త



ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎస్ఐ రామకృష్ణ

కరప: రోడ్డు ప్రమాదాలు, దొంగతనాలు జరగకుండా ప్రజలు అప్రమత్తంగా ఉంటూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్ఐ నౌడు రామకృష్ణ తెలిపారు. వలసపాకల గ్రామంలో గురువారం రాత్రి వారధి కార్యక్రమాన్ని నిర్వహించి ఆయన మాట్లాడుతూ ద్విచక్రవాహనంపై ప్రయాణించేటప్పుడు రహదారి భద్రతానియమాలు పాటించాలన్నారు. అలాగే వేసవిలో దొంగతనాలు జరగకుండా ఊరు వెళ్లేటప్పుడు ఇంటికి తాళంవేసి, కిటికీలలో, గోడలపైన తాళం చెవులు ఉంచరాదన్నారు. బంగారు ఆభరణాలు లాకరులో ఉంచుకోవాలని, పక్కింటివాళ్లకి చెప్పి వెళ్లాలన్నారు. సర్పంచ్ వాసంశెట్టి రామారావు, ఏఎస్ఐ వి.సూరిబాబు పాల్గొన్నారు.

## గురుకుల పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

కరప: స్థానిక మహాత్మ జ్యోతిబాపూలే ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల పాఠశాల (బాలుర)లో ప్రవేశానికి ఈనెల 6వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ కేవీ రామకృష్ణారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలలో ఆరో తరగతి నుంచి 9వ తరగతి వరకు ఉన్న ఖాళీలను భర్తీ చేసేందుకు జిల్లాలోని బీసీ వసతిగృహాలకు చెందిన విద్యార్థులు, అర్హులైన ఇంగ్లిషు మీడియం విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈనెల 8వ తేదీ ఉదయం 10 గంటలకు కరప గురుకుల పాఠశాలలో విద్యార్థులకు పరీక్ష నిర్వహించి అడ్మిషన్లు ఇస్తామని, మిగిలిన వివరాలకు 98496 42721 నంబర్‌లో సంప్రదించాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

## విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించండి

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరికలపై శుక్రవారం నుంచి ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని విద్యాశాఖ ఆర్‌జేడీ జి.నాగమణి సూచించారు. జిల్లా సమగ్రశిక్ష కార్యాలయంలో గురువారం జగనన్న విద్యాకానుకపై సమావేశం నిర్వహించారు. పాఠశాలలు తెరచిన రోజునే నాణ్యతతో కూడిన జగనన్న విద్యాకానుక అందించేలా మండల విద్యాశాఖాధికారులు చర్యలు తీసుకోవాలని, జిల్లాలో కనీసం 20 వేల మంది చేరే విధంగా స్థానిక అంగన్‌వాడీ కేంద్రాలు, సచివాలయ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ల సహకారంతో కృషిచేయాలని సూచించారు. డీఐఈ కేఎస్‌వీఎస్ అన్నపూర్ణ, సీఏంఓ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

## యూనిట్ రన్ క్యాంటీన్ ప్రారంభం



యూఆర్‌సీని ప్రారంభిస్తున్న ఎన్‌సీసీ గ్రూప్ కమాండెంట్ కల్నల్ రుషి

కాకినాడ రూరల్: మండలంలోని వలసపాకల ఎస్‌బీఐ బ్రాంచ్ పక్కన మాజీ సైనికోద్యోగులకు సబ్సిడీపై గృహోపకరణాలు, సరకులు తదితర వాటిని అందించేందుకు విశాలమైన భవనంలో యూనిట్ రన్ క్యాంటీన్‌ను ఎన్‌సీసీ గ్రూప్ కమాండెంట్ కల్నల్ ఏకే రుషి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిద్ధార్థనగర్‌లో క్యాంటీన్ ఇరుకుగా ఉండడంతో ఇక్కడకు మార్చినట్టు తెలిపారు. కార్యక్రమంలో క్యాంటీన్ వింగ్ కమాండర్ డీఎస్ఎస్ మూర్తి, క్యాంటీన్ మేనేజర్ కేవీవీఎస్ రావు, మాజీ సైనిక ఉద్యోగి వరప్రసాద్, ఎన్‌సీసీ సిబ్బంది, క్యాంటీన్ సిబ్బంది పాల్గొన్నారు.

## వైభవంగా భీమేశ్వర కల్యాణం

బోట్‌క్లబ్: స్థానిక దేవాలయంవీధిలోని బాలాత్రిపుర సుందరి సమేత భీమేశ్వర ఆలయంలో స్వామి వారి వార్షిక కల్యాణం గురువారం వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు కొడమంచలి కార్తీక్, కల్యాణ బ్రహ్మ తనికెళ్ల బుచ్చిబాబు ఆధ్వర్యంలో కల్యాణం నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ రాజనాల విజయసారధి స్వామికి పట్టు వస్త్రాలు సమర్పించారు.

# ఆడేద్దాం.. అప్రమత్తంగా..

- ముగింపు దశలో వేసవి సరదాలు
- ఎండల వేళ నీడపట్టు ఆటలే మంచిది
- ప్రమాదాలకు తావులేకుండా చూసుకోవాలి
- బడి బాటకు మిగిలున్నది కొద్దిరోజులే..



సముద్రంలో యువకుల విన్యాసాలు (ఫైల్)

కాకినాడ సిటీ: మూడేళ్లుగా వేసవి, సంక్రాంతి, దసరా వంటి సెలవులు వచ్చినప్పటికీ కరోనాతో ప్రజలు ఎవరూ ఆనందంగా గడపలేకపోయారు. విద్యార్థులకైతే మరీ కట్టేసినట్టైపోయింది. ఇన్నాళ్లకి వేసవి సెలవులు రావడంతో వారిలో ఉత్సాహం ఉరకలేయడం సహజం. వేసవి సెలవులు పూర్తి కావస్తున్నాయి. సుమారు పది రోజుల్లో పాఠశాలలు తెరుచుకోనున్నాయి. అమ్మమ్మ, నానమ్మల ముద్దు మురిపాలతో, ఆటపాటల్లో మునిగితేలుతున్న చిన్నారులు ఇక పుస్తకాలు చేతపట్టి చదువులకు సమాయత్తమవ్వాల్సిన తరుణం ఆసన్నమైంది. ఇంకా పదిరోజులే ఉన్నాయి గబగబా ఆడేసుకోవాలి.. చాలా ఆడేసుకోవాలి.. ఎన్నో ఆడేసుకోవాలి అనే తాపత్రయంతో ఎండనక, వాననక తిరగడం ఏటా జరిగే తంతే. ఈ పది రోజుల సమయంలోనే చిన్నారులు చాలా అప్రమత్తంగా ఉండాలి. పెద్దలూ వారిని ఓ కంట కనిపెడుతూ ఉండాలి.

గ్రామీణ ప్రాంతాలకు వచ్చే పిల్లలకు ముఖ్యంగా నీటిలో దిగి ఈత కొట్టడం, బైక్ నడపడం చేస్తుంటారు. సరైన శిక్షణ, పర్యవేక్షణ లేకపోతే సరదా మాట దేవుడెరుగు ప్రమాదాల పాలయ్యే ప్రమాదం ఉంది. సరదాకి వెళ్లి విషాదాంతమైన ఇటువంటి సందర్భాలను తల్లిదండ్రులు, ఇళ్లలోని పెద్దలు గుర్తెరగాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. వేసవి సెలవులను విజ్ఞానదాయకంగా మలుచుకునేలా ఎన్నో క్రీడా శిక్షణ శిబిరాలు నేడు అందుబాటులో ఉన్నాయి. క్రీడలు, సాంస్కృతిక కళలు, విద్య తదితర అంశాల్లో ఎన్నో నేర్చుకునేందుకు అవకాశాలు ఉన్నాయి. వాటిని పిల్లలు సద్వినియోగం చేసుకోవచ్చు.

**తల్లిదండ్రులు స్నేహితుల్లా వ్యవహరించాలి**



తల్లి దండ్రులు తమ పిల్లలతో స్నేహితుల్లా మెలగాలి. అప్పుడే ఎక్కడికి వెళ్లినా, ఏంచేసినా నిర్భయంగా చెప్పగలరు. అంతేకాక చెప్పిన విషయాలను కూడా చక్కగా వింటారు. వారితో ఎక్కువ సమయం కేటాయించాలి. సెలవుల సమయంలో పిల్లల గురించి తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి.

– పడాల మురళీకృష్ణారెడ్డి, డీఎస్పీ, కాకినాడ

## క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిత



విజేతలకు పతకాలు అందజేస్తున్న చీఫ్ కోచ్ శ్రీనివాస్ కుమార్

నాగమల్లితోట జంక్షన్: క్రీడల్లో రాణించే వారికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని జిల్లా క్రీడామైదానం చీఫ్ కోచ్ శ్రీనివాస్‌కుమార్ తెలిపారు. గురువారం రాత్రి స్థానిక జన్మభూమి పార్క్ స్కేటింగ్ రింక్‌లో వేసవి స్కేటింగ్ శిక్షణ శిబిరం ఘనంగా ముగిసింది. ఈ సందర్భంగా క్రీడాకారులకు నిర్వహించిన పోటీలను కాకినాడ స్మార్ట్ సిటీ మాజీ మేయర్ సుంకర శివప్రసన్న ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అండర్-4 - 14 ఏళ్ల బాల బాలికలకు పోటీలు నిర్వహించారు. పోటీల్లో విజేతలకు చీఫ్ కోచ్ పతకాలు, రోటరీ క్లబ్ కాకినాడ వారు అందించిన సర్టిఫికెట్లు అందజేశారు. కోచ్ లక్ష్మణ మాట్లాడుతూ మే 7 నుంచి నిర్వహించిన శిబిరంలో 120 మంది క్రీడాకారులు శిక్షణ పొందారని తెలిపారు. చీఫ్ కోచ్ శ్రీనివాస్ కుమార్ మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలను చదవుతో పాటు క్రీడల్లో ప్రోత్సహించాలన్నారు.